క్లుప్తంగా

ఎంపీ రఘునందన్‌కు వినతి



ఎంపీతో ముదిరాజ్ సంఘం నేతలు

సిద్దిపేటఅర్బన్: మండలంలోని పొన్నాలలో నిర్మించతలపెట్టిన ముదిరాజ్ విద్యార్థుల హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మించడానికి నిధులు కోరుతూ ఆ సంఘం సభ్యులు శనివారం ఎంపీ రఘునందన్‌రావును కలిసి వినతి పత్రం సమర్పించారు. సంఘం నాయకులు బైరి శంకర్, తుపాకుల బాల్‌రంగం మాట్లాడుతూ ఎంపీ రూ.28లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని పని ప్రారంభించి ప్రహరీ నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాజు, కిషన్, సిద్ధిరాములు, వెంకన్న, నర్సింహులు, యాదగిరి, చంద్రం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

భాషతోనే విద్యపై పట్టు



విద్యార్థులతో కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటేనే విద్యపై పట్టు సాధిస్తారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. నైపుణ్య ఆర్గనైజేషన్ చైర్మన్ ఐలయ్య ఆధ్వర్యంలో మిరుదొడ్డిలోని ప్రాథమిక పాఠశాలలో 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు శనివారం తెలుగు, ఇంగ్లిష్ డిక్షనరీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ భాషతో పాటు ఇతర భాషలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, మాజీ కో–ఆప్షన్ మెంబర్ ఎండీ అహ్మద్, మాజీ ఎంపీటీసీ భైరయ్య, ఆర్గనైజేషన్ సభ్యులు కొండల్‌రెడ్డి, సాయి, అనిల్, విజయ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ బాలుర కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తిచేసి హార్టికల్చర్ యూనివర్సిటీలో డిగ్రీ సీటు సాధించిన విద్యార్థి మోహన్‌దాస్‌ను ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు హార్టికల్చర్, అగ్రికల్చర్‌కు సంబంధించిన కోర్సులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి దేవయ్య, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, రఘురాజ్, నగేశ్, నవనీత, కొమురయ్య విద్యార్థిని అభినందించారు.

వస్త్రాల తయారీపై విద్యార్థులకు స్టడీటూర్

దుబ్బాక: అప్పారెల్ టూర్‌లో భాగంగా బెజ్జంకి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలకు చెందిన 130మంది విద్యార్థులు శనివారం దుబ్బాకను సందర్శించారు. చేనేత సహకార సంఘంలో మగ్గాలపై చేనేత కార్మికులు తయారు చేస్తున్న వస్త్రాలను విద్యార్థులకు స్వయంగా చూపించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో లెక్చరర్లు శివకుమార్, సంతోష, రఘునందన్ విద్యార్థులకు వస్త్రాల తయారీపై అవగాహన కల్పించారు. ఉపాధి అవకాశాలు ఉన్న ఇంటర్ కోర్సుల్లో చేరాలని విద్యార్థులకు సూచించారు. మోడల్ స్కూల్ అధ్యాపకులు నాజీయ, రమేశ్, బాబు పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన జిల్లా జడ్జి



జడ్జితో న్యాయవాదులు, అధికారులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలో కోర్టు ప్రారంభోత్సవానికి సంబంధించిన జరుగుతున్న పనులను జిల్లా జడ్జి సాయిరమాదేవి శనివారం పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ నాగేందర్, తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్, సీఐ ఎల్.శ్రీను, ఎస్‌ఐ నీరేశ్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు మనోహర్, సురేందర్, రాములు, సురేందర్, న్యాయవాదులు మహేందర్, రమేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

విత్తన ఎంపిక ఎంతో కీలకం

- వరిసాగులో నారుమడి ముఖ్యం
- తక్కువ పంటకాలం రకాలతో మేలు
- మండల వ్యవసాయధికారి శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: పంటల సాగులో అధిక దిగుబడి సాధించడానికి మేలైన విత్తనాల ఎంపిక ఎంతో కీలకమని మండలం వ్యవసాయాధికారి బి.శ్రీనాథ్ చెప్పారు. మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో వరి నారు మడులను శనివారం ఆయన పరిశీలించి పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు పలు సూచనలిచ్చారు.

స్వల్పకాలిక రకాలే మంచిది

యాసంగిలో రైతులు ఎక్కువగా దొడ్డురకం వరి



నారు మడిని పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్

వైపు మొగ్గు చూపుతుంటారని, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని స్వల్పకాలిక రకాలైన (120–130 రోజుల పంట కాలం) కూనారం సన్నాలు(కేఎన్‌ఎం–118), జగిత్యాల రైస్–1(జేజీఎల్–24423) వంటి వాటిని ఎంపిక చేసుకోవాలని సూచించారు. నవంబర్ 15నుంచి డిసెంబర్ 20 మధ్యలో నారు పోసుకోవడమే మేలని, అలాగే చలి ఉధృతిని బట్టి పంట కాలం 10 నుంచి 15 రోజులకు పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ క్రమంలో చలి ప్రభావం నారుమళ్లపై పడకుండా ప్రత్యేక యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. ముఖ్యంగా వానాకాలం పంట కోతలైన వెంటనే రైతులు యాసంగి పంటకు దుక్కులు సిద్ధం చేసుకొని త్వరగా నారు అలికి నాట్లు వేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని తెలిపారు.

యాసంగి నారుమడిలో జాగ్రత్తలు

- నారుమడిలో మండె కట్టిన విత్తనాలను వేయడం తప్పనిసరి
- నారుపోసే మందు మడికి సరిపడా (సుమారు 2క్వింటాళ్లు) బాగా మాగిన పశువుల ఎరువు/కోళ్ల ఎరువు, కిలో జింక్ సల్ఫేట్ తప్పని సరిగా వేసుకోవాలి.
- భాస్వరాన్ని రెట్టింపు మోతాదులో వేసుకోవాలి
- రాత్రిపూట నారుమడిలో నీళ్లు లేకుంటే చలి ప్రభావం మొక్కలపై తగ్గుతుంది. కాబట్టి ప్రతిరోజూ పొద్దున, పగటిపూట వెచ్చని నీటిని పెట్టి సాయంత్రం తీసివేయాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నారుమడి చుట్టు ఒక అడుగు ఎత్తులో పలుచని పాలిథిన్ షీట్ లేదా ఖాళీ ఎరువుల సంచులతో కుట్టిన పట్టాలను సాయంత్రం వేళల్లో కప్పి ఉదయం పూట తీసివేయాలి.
- రాత్రిఉష్ణోగ్రతలు 10డిగ్రీల కంటే తగ్గినప్పుడు చలి తీవ్రత పెరిగి నారు ఎర్రబడడం, సరిగ్గా ఎదగకపోవడం పంట కాలం పెరిగిపోవడం, పోషక లోపాలు ముఖ్యంగా జింక్ లోప లక్షణాలు కనిపించే అవకాశం ఉంది.
- ఈ జింక్‌లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడతాయి. ఈ లోప నివారణకుగాను లీటరు నీటికి 2గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉంటే స్వర్ణఫాల్/ఫార్ములా–4 వంటి సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని 5రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.
- కాండం తొలిచే పురుగు బారి నుంచి నారును కాపాడుకునేందుకు, నారు తీయడానికి వారం రోజుల ముందు, 5 సెంట్ల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేయాలి
- చలి తీవ్రత ఎక్కువగా ఉంటే అగ్గితెగులు ఆశించే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 0.6గ్రా. ట్రైసైక్లోజోల్‌ను కలిపి పిచికారీ చేయాలి.
- ఈ పద్ధతులను రైతులు పాటిస్తే ఆరోగ్యవంతమైన నారు పెంచుకొని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు.

విధి నిర్వహణలో క్రమశిక్షణ అవసరం

- అదనపు డీసీపీ రాంచందర్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): పోలీసులు విధి నిర్వహణలో క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఏఆర్ అదనపు డీసీపీ రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి శనివారం పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, అధికారులు, సిబ్బంది ప్రదర్శించిన స్క్వాడ్, లాఠీ డ్రిల్, నీట్‌డ్రెస్ అవుట్‌ను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది క్రమం తప్పకుండా వాకింగ్, రన్నింగ్, యోగా వంటివి చేసి



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీసీపీ

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పరేడ్ సిబ్బందికి ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడు తుందన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో నమూనా ఎన్నికలు



ఓటింగ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

- పరిశీలించిన డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పంచాయతీ నమూనా ఎన్నికలు నిర్వహించారు. నిజమైన ఎన్నికలను తలపించేలా నోటిఫికేషన్, నామినేషన్ ప్రక్రియ, స్క్రూటినీ, పోలింగ్ సిబ్బంది నియామకం, గుర్తుల కేటాయింపు, ఓటింగ్, కౌంటింగ్ ప్రకియలు నిర్వహించారు. ఈ ప్రక్రియను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌ఐ రాజు పరిశీలించారు. విద్యార్థులకు ఎన్నికల ప్రకియ అర్థం అయ్యేవిధంగా నమూనా ఎన్నికలు నిర్వహించిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాములు, కొండపాక ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, రంగనాథ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో అధిక తూకం

- రైతుల ఆగ్రహం

మిరుదొడ్డి(దుబ్బాక): పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధిక తూకం వేసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో నిబంధనలకు విరుద్ధంగా తూకం వేస్తున్నారని రైతులు ఆరోపించారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కొనుగోలు కేంద్రం పరిశీలనకు వచ్చిన ఏడీఏ మల్లయ్య దృష్టికి రైతులు ఈ విషయాన్ని తీసుకువచ్చారు. ఒక్కో బస్తాపై సుమారు కిలో వరకు ధాన్యం అధికంగా తూకం



ఏడీఏ మల్లయ్యతో మాట్లాడుతున్న రైతులు

వేస్తున్నారని, కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఏడీఏ తెలిపారు.

సత్యసాయి సేవలు చిరస్మరణీయం

హుస్నాబాద్/బెజ్జంకి(సిద్దిపేట): స్థానిక సత్యసాయి సేవా మందిరంలో సత్య సాయిబాబా జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ రజిత మాట్లాడుతూ సత్యసాయి ఎంతో మంది పేద ప్రజలకు సేవలు అందించారన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. సింగిల్ విండో చైర్మన్ శివయ్య, కౌన్సిలర్లు శ్రీనివాస్, వల్లపు రాజు, సంధ్యావళి పాల్గొన్నారు. అదే విధంగా బెజ్జంకి సత్యసాయి గురుకుల విద్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఆయన చిత్ర పటంతో పల్లకి సేవ నిర్వహించారు. కరస్పాండెంట్ వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ సంపత్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు గంటల ప్రాతిపదికన ఇంగ్లిష్ బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీ, డిగ్రీ అర్హత కలిగి ఉండాలని, ఆసక్తిగల వారు మంగళవారం పాఠశాలలో జరిగే డెమోకు హాజరు కావలని సూచించారు. వివరాలకు 99667 58514 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ నర్సపూర్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సపూర్, నర్సపూర్ ఎక్స్ రోడ్డు, వాసవినగర్, శంకర్‌నగర్, గుండ్ల చెరువు, కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీ, హరిహర రెసిడెన్షిల్ కాలనీ ప్రాంతాలలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

వర్గల్(గజ్వేల్): మండలంలోని అవుసులోని పల్లిలో శనివారం పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అవుసులోని పల్లిలోని మరాఠి నర్సింహులు ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గౌరారం పోలీసులు దాడిచేశారు. పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.36,860 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అథ్లెటిక్స్‌తో ఉజ్వల భవిష్యత్

సిద్దిపేటజోన్: అథ్లెటిక్స్ క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి వెంకట్‌స్వామి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం జిల్లాస్థాయి సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ ప్రాంతాలకు చెందిన 200 విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు రామేశ్వర్ రెడ్డి, భిక్షపతి, కనక రెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రియాంక

రాజీకి చక్కని మార్గం లోక్ అదాలత్

- న్యాయమూర్తి ప్రియాంక

గజ్వేల్: స్థానిక కోర్టు ఆవరణలో వచ్చే నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని ప్రిన్సిపల్ అడిషనల్ సివిల్ జడ్జి ప్రియాంక పిలుపునిచ్చారు. స్థానిక కోర్టులో లోక్ అదాలత్ కార్యక్రమానికి సంబంధించి పోలీసుశాఖతో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీమార్గానికి జాతీయ లోక్ అదాలత్ చక్కని వేదిక అని చెప్పారు. పోలీసులు చొరవ తీసుకొని ఈ అవకాశాన్ని ఎక్కువ మంది వినియోగించుకునేలా చూడాలన్నారు.

ఫోరెన్సిక్‌పై అవగాహన

ఫోరెన్సిక్ అంశాలపై న్యాయవాదులకు ప్రోబ్ ల్యాబ్ డైరెక్టర్ మోహన్ అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ ఇలాంటి అవగాహన సదస్సులు న్యాయవాదులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పండరి, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థి దశే భవిష్యత్‌కు మూలం

- త్రీటౌన్ సీఐ విద్యాసాగర్

కొండపాక(గజ్వేల్)/మద్దూరు(హుస్నాబాద్)/హుస్నాబాద్: విద్యార్థి దశే భవిష్యత్‌కు కీలకమని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని దుద్దెడలో గల సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం– ఎదురయ్యే అనర్థాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజీగా డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల విక్రయాలకు అలవాటు పడొద్దన్నారు. మత్తు పదార్థాలను అమ్ముతున్నా, సేవిస్తున్నట్లు గుర్తించినా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు(8712667100) సమాచారం అందించాలని కోరారు. ప్రిన్సిపాల్ సతీశ్‌కుమార్, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని బైరాన్‌పల్లి ఉన్నత పాఠశాలల్లో సైబర్ నేరాలపై విద్యార్థులకు ఎస్‌ఐ షేక్ మహబూబ్ అవగాహన కల్పించారు. మహిళ రక్షణ, ఇతర సమస్యలపై100, 1930 టోల్ ఫ్రీ నంబర్‌లకు సమాచారం అందించాలన్నారు. హుస్నాబాద్ మోడల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు వాటి అనర్థాలపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ పవన్ అవగాహన కల్పించారు. ఎస్‌ఐ దామోదర్, స్కూల్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.



కొండపాక(గజ్వేల్): మాట్లాడుతున్న విద్యాసాగర్

తాగునీటి కోసం మహిళల ఆందోళన



పంచాయతీలో ఆందోళన చేస్తున్న మహిళలు

- మూడు నెలలుగా ఇబ్బందులు
- పంచాయతీలో బైఠాయింపు

కోహెడరూరల్(హుస్నాబాద్): తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండల పరిధిలోని బస్వాపూర్‌కు చెందిన మహిళలు శనివారం ఆందోళనకు దిగారు. పంచాయతీలో బైఠాయించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడతూ మూడు నెలలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్నామన్నారు. అయినా పట్టించుకునే నాథుడేలేడని వాపోయారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందనలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి తెచ్చుకుంటున్నామన్నారు. తక్షణమే తమకు నీటి సరఫరా చేయాలని, లేకపోతే ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు.

వైభవోపేతం.. కార్తీక దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రం సామూహిక వ్రతాలు, కార్తీక దీపోత్సవాలతో వైభవంగా అలరారుతోంది. ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు శనివారం సామూహిక సత్యదేవుడి వ్రతాలు ఆచరించారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం శంఖు, చక్ర, పద్మదళ, ఓంకారాది ఆకృతుల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. త్రిగుళ్ల కృష్ణచంద్రశర్మ బృందం చేసిన శివతాండవ గానం భక్తులను అలరించింది. ఈఓ అన్నపూర్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీపాండురంగ ఆలయాభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మర్కూక్(గజ్వేల్): శ్రీపాండురంగ ఆశ్రమ ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చెప్పారు. మండలంలోని భవానందపూర్ సమీపంలో గల శ్రీపాండురంగ ఆశ్రమంలో శ్రీరుక్మిణి పాండురంగస్వామిని శనివారం కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యే దంపతులకు శాలువాలు కప్పి ప్రసాదాలు అందజేశారు. సత్యనారాయణ శర్మ, రసరాజశర్మ, భవానందశర్మ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

సిద్దిపేటకమాన్: షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగిన ఘటన సిద్దిపేటలో శనివారం చోటు చేసుకుంది. పటేల్‌పురకు చెందిన శశికళ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. నిత్యావసర, ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రూ.3లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

◆ అలసత్వం చూపితే చర్యలు

కొండపాక(గజ్వేల్): విద్యార్థులకు అర్థమయ్యే తీరులో బోధించాలని, అలసత్వం చూపిన ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని ఎంఈఓ బచ్చలి సత్తయ్య హెచ్చరించారు. కుకునూరుపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిచాలన్నారు. అనంతరం అయా గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. హెచ్‌ఎంలు, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

◆ వరి కొయ్యలను కాలిస్తే ఎంతో నష్టం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మైసమ్మవాగుతండాలో శనివారం ఏఈఓ కరంటోతు శ్రీలత వరి కొయ్యలను కాలిస్తే కలిగే నష్టాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. భూసారం దెబ్బతింటుందన్నారు. అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో ఆరుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శనివారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.6,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



దుబ్బాకరూరల్: ఇటీవల గజ్వేల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17 నెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. దుబ్బాక మండలం చీకోడ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు భువన, భావన ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జానకీరాములు తెలిపారు.

◆ స్పోర్ట్స్ సామగ్రి అందజేత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కోల లింగయ్య రూ.30వేల విలువైన స్పోర్ట్స్ దుస్తులు అలాగే ఉపాధ్యాయులు నాగరాజు, సుమలత రూ.18వేల విలువైన స్పోర్ట్స్ సామగ్రిని, కోమటి లింగమూర్తి సమకూర్చిన రూ.70వేల విలువ గల సౌండ్ బాక్సులను ఎంఈఓ గుగులోతు రంగానాయక్ చేతుల మీదుగా శనివారం అందజేశారు.

◆ ఓర్వలేకనే విమర్శలు

దుబ్బాక/తొగుట(దుబ్బాక): పేదల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. రవి, దేవేందర్, భరత్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా తొగుట మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు చెక్కులను అందించారు.

◆ చేనేత కార్మికులకు ప్రయోజనం

సిద్దిపేటజోన్: వేములవాడలో యారన్ డిపో వల్ల చేనేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పద్మశాలి, చేనేత కార్మికుల కష్టాలు తీర్చేలా రూ.50 కోట్లతో యారన్ డిపో ఆలోచనపై సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

◆ రూ.52వేలు ఆర్థిక సహాయం

దుబ్బాకరూరల్: మండలంలోని రాజక్కపేట మధిర గ్రామం ఎల్లాపూర్‌కు చెందిన రాజెల్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతడి మిత్రులు, గ్రామస్తులు విరాళాలు సేకరించి ఆ పేద కుటుంబానికి రూ.52వేలు అందజేశారు.

◆ అభయ యాప్‌పై అవగాహన

సిద్దిపేటకమాన్: అభయ యాప్ వినియోగంపై బాలికలు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్‌ఐలు ఉమేశ్, సదాశివరావు తెలిపారు.

◆ 120 మందికి వైద్యపరీక్షలు

దుబ్బాకటౌన్: ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని లయన్స్ క్లబ్ స్నేహ గజ్వేల్ లైన్ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ అన్నారు. రాయపోల్‌లో మెడిసిటీ ఆస్పత్రి, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 120 మందికి బీపీ, షుగర్ టెస్టులు చేసి ఉచితంగా మందులు అందజేశారని చెప్పారు. క్లబ్‌ప్రతినిధులు అజయ్ కుమార్‌రెడ్డి, సత్యనారాయణ, వైద్యులు చంద్రారెడ్డి, ప్రణవి తదితరులు పాల్గొన్నారు.